ఆత్మ గౌరవంతో ఆర్థిక స్వావలంబన సాధించండి



- దివ్యాంగులకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పిలుపు
- ఏయూ మెరైన్ గ్రౌండ్‌లో దివ్య కళామేళా ప్రారంభం

... వివరాలు 5వ పేజీలో

పేదోడికి పట్టెడన్నం

అన్న క్యాంటీన్లు పునఃప్రారంభం

- రూ.5కే కడుపునిండా ఆహారం
- ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం
- పేదలు, కూలీల కళ్లల్లో ఆనంద బాష్పాలు
- శుచిగా, రుచిగా హరే కృష్ణ మూవ్‌మెంట్ వంటకాలు

ఈ రోజుల్లో ఐదు రూపాయలు పెడితే ఏమి వస్తుంది?. కనీసం టీ కూడా రాదు. కానీ, కూటమి ప్రభుత్వం ఆ ఐదు రూపాయలకే పేదలకు కడుపు నిండా రుచికరమైన భోజనం అందించేందుకు సిద్ధమైంది. తెలుగుదేశం ప్రభుత్వం గతంలో నిర్వహించిన 'అన్న క్యాంటీన్ల'ను గురువారం జీవీఎంసీ పరిధిలో పునఃప్రారంభించింది. వీటి ప్రారంభంపై రోజువారీ పనులు చేసుకునేవారు, పేదలు, నిరుద్యోగ యువత అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. మూడు పూటలూ కడుపు నిండా తింటామని, ఇక ఆకలితో గడపాల్సిన అవసరం లేదని అంటున్నారు. జీవీఎంసీ పరిధిలో మొత్తం 25 అన్న క్యాంటీన్లకు గాను గురువారం పద్దెనిమిదింటిని ప్రారంభించారు. శుక్రవారం మరో ఐదు, శనివారం మిగిలిన రెండు ప్రారంభించనున్నారు.



రైల్వేస్టేషన్ వద్ద అన్న క్యాంటీన్‌లో భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కూటమి నాయకులు

విశాఖపట్నం/అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి)

పేదలు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న 'అన్న క్యాంటీన్లు' అందుబాటులోకి వచ్చాయి. జీవీఎంసీ పరిధిలో 18 క్యాంటీన్లను కూటమి నేతలు గురువారం రాత్రి ప్రారంభించారు. పేదలు, కూలీలు ఆకలితో ఉండకూడదని, ప్రతి ఒక్కరూ కడుపు నిండా తిని నచ్చిన పనులు చేసుకోవాలని కూటమి ప్రభుత్వం వీటిని పునఃప్రారంభించింది. కేవలం ఐదు రూపాయలకు ఇక్కడ ఆహారం అందిస్తారు. ఉదయం పూట టిఫిన్‌గా ఇడ్లీ/పూరీ/ఉప్మా/పొంగల్, మధ్యాహ్న భోజనంలో అన్నం, కూర, సాంబారు, పెరుగు, పచ్చడి ఉంటాయి. రాత్రి భోజనంలో కూడా అలాగే ఉంటాయి. వంటకాలన్నీ శుచిగా, రుచిగా ఉండేందుకు ఎంతో పేరు ప్రఖ్యాతలు, సేవాభావం ఉన్న హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. వీరు ప్రస్తుతం అక్షయ పాత్రకు చెందిన కంచరపాలెం వంటశాలలో ఈ వంటకాలను తయారు చేసి వేడి వేడిగా క్యాంటీన్లకు పంపుతున్నారు. త్వరలో సొంతంగా వంటశాల ఏర్పాటు చేసుకొని అక్కడే వంటలు చేస్తారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ గురువారం కంచరపాలెం వెళ్లి ఈ వంటలు ఎలా చేస్తున్నారో పరిశీలించారు. అధునాతన పరికరాలను ఉపయోగించి, నాణ్యమైన దినుసులతో వంటకాలు తయారుచేస్తున్న విధానాన్ని ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ భక్తదాస వివరించగా సంతృప్తి వ్యక్తంచేశారు.

అనకాపల్లిలో రెండు చోట్ల ప్రారంభం

అనకాపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ వైద్యాలయం, రైల్వేస్టేషన్‌ల వద్ద గురువారం రాత్రి అన్న క్యాంటీన్లు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జనసేన 80వ వార్డు ఇన్‌చార్జి తాడి రామకృష్ణ సతీమణి శాంతి పాల్గొని ప్రారంభించారు.

ముందే మెనూ సిద్ధం

అన్న క్యాంటీన్ల ద్వారా ఏ రోజు, ఏ పూట ఏ ఆహారం ఇవ్వాలనేది రాష్ట్ర ప్రభుత్వం ముందే మెనూ తయారుచేసింది. దానిని హరే కృష్ణ మూవ్‌మెంట్‌కు ... మిగతా 6వ పేజీలో

రుచికరమైన భోజనం



ఐదు రూపాయలకే ప్రభుత్వం రుచికరమైన భోజనం అందించడం చాలా సంతోషంగా ఉంది. భోజనం చాలా బాగుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయడం మాలాంటి ఎంతో మంది కార్మికులకు ఉపయోగం.

\- కె.తాతారావు, వెదురువాడ

చంద్రబాబుకు ధన్యవాదాలు



పేదల కోసం కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయడం శుభపరిణామం. మాలాంటి వారికి ఈ భోజనం ఎంతో తృప్తినిస్తుంది. ఐదు రూపాయలకు ఈ రోజుల్లో టీ కూడా రావడం లేదు. అటువంటిది కడుపునిండా భోజనం పెడుతున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు.

\- కె.సన్యాసమ్మ, గాంధీనగరం

సీఆర్‌ఎంటీల్లో టెన్షన్

స్కూల్ కాంప్లెక్స్‌ల కుదింపు నిర్ణయంతో అభద్రతాభావం

- విధుల నుంచి తొలగిస్తారేమోనని ఆందోళన
- తక్కువ వేతనానికి పని చేస్తున్న తమను ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు



పాఠశాలలో విద్యాబోధన చేస్తున్న సీఆర్‌ఎంటీ

చోడవరం, సెప్టెంబరు 19:

జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా మండలాల్లో స్కూల్ కాంప్లెక్స్‌లను కుదిస్తుండడంపై క్లస్టర్ రిజర్వు మొబైల్ టీచర్(సీఆర్‌ఎంటీ)లలో ఆందోళన వ్యక్తమవుతున్నది. స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ఇప్పటి వరకు మండలాల్లో ఉన్న స్కూల్ కాంప్లెక్స్‌లను మరింత తగ్గించే ప్రయత్నాలను విద్యాశాఖ అధికారులు చేపట్టారు. ఈ స్కూల్ కాంప్లెక్స్‌ల కుదింపు వల్ల ఇప్పటి వరకూ క్లస్టర్ ప్రాతిపదికన బీఈడీ విద్యార్హతతో నియమితులైన సీఆర్‌ఎంటీ పోస్టులు ఎక్కడ గల్లంతవుతాయోనన్న ఆందోళన సీఆర్‌ఎంటీలలో నెలకొంది.

సమగ్రశిక్ష విభాగంలో గత 12 సంవత్సరాలుగా వీరంతా స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో తొలుత సీఆర్‌పీలుగా, ఆ తరువాత సీఆర్‌ఎంటీలుగా వ్యవహరిస్తూ విద్యాశాఖ నిర్వహించే అనేక కార్యక్రమాల్లో సేవలందిస్తున్నారు. ఒక పక్క ఉపాధ్యాయుడిగా, మరోవైపు విద్యా కార్యక్రమాలు అమలు చేసే సిబ్బందిగా రెండు రకాల సేవలందిస్తున్న ఈ సీఆర్‌ఎంటీలు విద్యావ్యవస్థలో కీలకంగా మారారు. మండల స్థాయిలో ఎక్కడైనా ఏకోపాధ్యాయుడు సెలవు పెడితే ఆ పాఠశాల మూతపడకుండా వీరు ఆ పాఠశాలలో ప్రత్యామ్నాయ ఉపాధ్యాయుడిగా సేవలందించడంతో పాటు మిగిలిన సమయాల్లో మండల విద్యాశాఖ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తూ వస్తున్నారు. 6 నుంచి 14 ఏళ్లలోపు బడి బయట విద్యార్థులను గుర్తించి వారిని స్కూళ్లలో చేర్పించడం, ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే స్కూల్ కిట్‌లు పాఠశాలలకు చేరవేయడం దగ్గర నుంచి అవి విద్యార్థులకు అందేలా చూడడం వరకూ వీరిదే బాధ్యత. ఇక స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహణలో భాగస్వాములు కావడంతో పాటు పాఠశాల మధ్యాహ్న భోజన పథకం అమలులో బియ్యం, గుడ్లు, చిక్కీలు వారికి అందుతున్నవీ లేనిదీ పర్యవేక్షణ బాధ్యతలు కూడా వీరిదే. పాఠశాలల పరిధిలో విద్యార్థుల హాజరు నమోదు వంటి పనులు పూర్తిగా వీరే నిర్వహిస్తున్నారు. స్థూలంగా విద్యావ్యవస్థలో విద్యాశాఖ కార్యాలయానికి, ఉపాధ్యాయులకు మధ్య అనుసంధానంగా ఈ సీఆర్‌ఎంటీలు వ్యవహరిస్తున్నారు.

ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకం

స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో ఈ సీఆర్‌ఎంటీలు నెలకు రూ.23,500 వేతనంతో పని చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 112 మంది సీఆర్‌ఎంటీలు పనిచేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో వేతనాలు పెంచాలని ఆందోళన చేసినా, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరినా వీరికి ఎలాంటి న్యాయం జరగలేదు. తాజాగా స్కూల్ కాంప్లెక్స్‌ల కుదింపు వల్ల తమ ఉద్యోగాలను ఎక్కడ తీసివేస్తారోనన్న ఆందోళన వీరిని వెంటాడుతున్నది. తక్కువ వేతనం అయినప్పటికీ స్థానికంగా ఉండడం వల్ల ఏదో విధంగా వీరంతా ఆయా మండలాల పరిధిలో ఉద్యోగాలు చేస్తూ గత 12 సంవత్సరాలుగా తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. స్కూల్ కాంప్లెక్స్‌ల కుదింపుతో వీరిని తొలగించడం లేదా మరో చోటకు బదిలీ చేయడం చేస్తే ఈ తక్కువ వేతనాలతో తమ కుటుంబ పోషణ ఎలా అని వీరంతా ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తమ సమస్యను మానవీయకోణంలో ఆలోచించి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

సీఆర్‌ఎంటీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఏళ్ల తరబడి విద్యాశాఖలో తక్కువ వేతనాలతో సేవలందిస్తున్న తమకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలి. బీఈడీ విద్యార్హత కలిగిన మేమంతా ఇతర అవకాశాలు కూడా వదులుకుని ఈ ఉద్యోగాలనే నమ్ముకుని పనిచేస్తున్నాం. ఇప్పుడు స్కూల్ కాంప్లెక్స్‌లు కుదించాలని తీసుకున్న నిర్ణయం వల్ల మా ఉద్యోగాలు ఉంటాయో లేదో తెలియని పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం మా సమస్యను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించే దిశగా భరోసా ఇవ్వాలని కోరుతున్నాం. **- పూడి వెంకటరావు,** సీఆర్‌ఎంటీల హక్కుల సాధన సమితి నాయకుడు



గాజుల అలంకరణలో మరిడిమాంబ అమ్మవారు

గాజుల అలంకరణలో మరిడిమాంబ

స్థానిక గవరపాలెంలో కొలువైన మరిడిమాంబ అమ్మవారికి గురువారం గాజులతో ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారి నెల పండగ సందర్భంగా అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. - అనకాపల్లి టౌన్

ఇసుక అక్రమాలకు చెక్

ఆన్‌లైన్ బుకింగ్‌కు శ్రీకారం

- వర్చువల్ విధానంలో పోర్టల్‌ను ప్రారంభించిన సీఎం
- నేటి నుంచి అమలు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం ఇసుక అక్రమార్కులకు చెక్ పెట్టేందుకు నూతన ఇసుక విధానాన్ని అమలులోకి తెచ్చింది. ఇసుక విక్రయాల్లో పారదర్శకత కోసం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం వర్చువల్ విధానంలో ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ పోర్టల్‌ను ప్రారంభించారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ఉచిత ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ అందుబాటులోకి రానున్నది.



నక్కపల్లి ఇసుక డిపోలో నిల్వలు

జిల్లాలో నక్కపల్లి, నర్సీపట్నం డిపోల్లో మాత్రమే ఇసుక నిల్వలు ఉన్నాయి. నర్సీపట్నంలో 40 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వల్లో తేడాలున్నాయని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఫిర్యాదు చేయడంతో అక్కడ ఇసుక ఆఫ్‌లైన్ విక్రయాలు నిలిపేశారు. నక్కపల్లి ఇసుక డిపోలో సుమారు 60 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలను ఇటీవల వరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు గనుల శాఖ సిబ్బంది ద్వారా ఆఫ్‌లైన్ పద్ధతిలో విక్రయించారు. ఇప్పటి వరకు 43 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఆఫ్‌లైన్‌లో అమ్మకాలు జరిపినట్టు గనుల శాఖ అధికారులు చెబుతున్నారు. నక్కపల్లిలో ఇంకా 17 వేల మెట్రిక్ టన్నుల ఇసుక మాత్రమే ఉంది. నక్కపల్లి డిపోలో ప్రస్తుతం ఉన్న ఇసుక నిల్వలను శుక్రవారం నుంచి ఆన్‌లైన్ విధానంలో గనుల శాఖాధికారులు ... మిగతా 6వ పేజీలో



ఉచిత ఇసుక పోర్టల్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ, అధికారులు

పోర్టల్ పోస్టర్ ఆవిష్కరణ

అనకాపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ పోర్టల్ పోస్టర్‌ను గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయకృష్ణన్ ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతి నుంచి వర్చువల్ విధానంలో ఏపీ శాండ్ పోర్టల్‌ను ప్రారంభించగా, ఈ కార్యక్రమాన్ని వీక్షించిన అనంతరం కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి, గనుల శాఖ జిల్లా అధికారి సుబ్బారాయుడు, డీపీఓ శిరీషారాణి తదితరుల ఆధ్వర్యంలో ఉచిత ఇసుక పోర్టల్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సింహాచలం దేవస్థానం ఈఓగా వేండ్ర త్రినాథరావు

గతంలో పలుమార్లు ఇన్‌చార్జిగా బాధ్యతల నిర్వహణ



నూతన ఈఓ వేండ్ర త్రినాథరావు

సింహాచలం, సెప్టెంబరు 19: సింహాచలం వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా దేవదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్, ప్రస్తుతం ద్వారకా తిరుమల వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈఓగా పనిచేస్తున్న వేండ్ర త్రినాథరావును నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఏడాదికాలంపాటు డిప్యుటేషన్‌పై ఈఓగా పనిచేసిన రెవెన్యూ శాఖకు చెందిన డిప్యూటీ కలెక్టర్ సింగాల శ్రీనివాసమూర్తిని మాతృశాఖకు బదిలీ చేస్తూ దేవదాయ శాఖ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. ఆయన స్థానంలో విశాఖ జిల్లా దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాతను దేవస్థానం ఇన్‌చార్జి ఈఓగా ప్రభుత్వం నియమించింది. ఆమె ఈనెల 17న బాధ్యతలు స్వీకరించారు. అయితే గురువారం త్రినాథరావును నియమిస్తూ దేవదాయ శాఖ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు ఇచ్చారు. త్రినాథరావు దేవస్థానానికి ఇన్‌చార్జి ఈఓగా 2020 సెప్టెంబరు 2 నుంచి 2021 జనవరి 22 వరకు ఒకసారి, 2022 సెప్టెంబరు 22 నుంచి 2023 జూన్ 10 వరకు మరోసారి, 2023 ఆగస్టు 26 నుంచి 2023 సెప్టెంబరు 17 వరకు ఇంకొకసారి విధులు నిర్వహించారు.

సాగునీటి కష్టాలు తీరేదెన్నడో?

నిండుకుండలా తాండవ రిజర్వాయర్

- కాలువలు పూడుకుపోవడంతో పొలాలకు అందని నీరు
- గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణమని రైతుల ఆవేదన

కోటవురట్ల, సెప్టెంబరు 19:

సాగునీటి వనరులను గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేయడంతో మండలంలోని రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం తాండవ రిజర్వాయర్ నిండుకుండలా ఉన్నా సాగునీటి కాలువలు పూడుకుపోవడంతో మండలంలోని శివారు పొలాలకు నీరు అందడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు వరి నాట్లు వేసుకున్న రైతులు ఇప్పుడు సాగునీరు అందక పొలాలు ఎండిపోతుండడంతో గగ్గోలు పెడుతున్నారు.



నిండుకుండలా ఉన్న తాండవ రిజర్వాయర్

మండలంలో తాండవ రిజర్వాయర్ ద్వారా సుమారు 5,600 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. ఈ రిజర్వాయర్ ఇటీవల కురిసిన వర్షాలకు నిండుకుండలా ఉంది. అయితే నాతవరం మండలం చెర్లోపాలెం నుంచి కోటవురట్ల మండలంలోని పలు గ్రామాలకు వచ్చే సాగునీటి కాలువలు పూడుకుపోవడంతో పొలాలకు నీరు రావడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో కాలువలు తుప్పలతో పూడుకుపోయాయి. తాండవ నుంచి చెర్లోపాలెం వరకు సాగునీరు వస్తోంది. అక్కడ నుంచి పాములవాక, నీలిగుంట, సన్యాసిరాజుపాలెం, బోడపాలెం, కొత్తూరు, తంగేడు గ్రామాలకు సాగునీరు అందడం లేదు. అధికారులు రిజర్వాయర్ నుంచి సాగునీరు విడుదల చేసినప్పటికీ కోటవురట్ల మండలంలోని చివరి భూములకు సాగునీరు అందక రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతులు ఇటీవల వర్షాలు కురవడంతో వరి నాట్లు వేశారు. తాండవ గేటుకు మరమ్మతులు చేసిన తరువాత నీరు పుష్కలంగా వస్తుందని భావించారు. అయితే కాలువలు పూడుకుపోవడంతో నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని కిల్లాడ శ్రీనివాసరావు అనే రైతు వాపోయాడు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కాలువల్లో పూడికలు తీయించి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



నీలిగుంట వద్ద తుప్పలతో పూడుకుపోయిన సాగునీటి కాలువ



క్రైం... crime news

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి


దుర్గాప్రసాద్ (ఫైల్)

నాతవరం, సెప్టెంబరు 19: మండలంలోని ఎం.బెన్నవరంలో ఇంటి యాజమానికి ఎలక్ట్రీషియన్‌కు సమన్వయ లోపం వలన ఓ నిండుప్రాణం బలైంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఎం.బెన్నవరంలోని ఓ ఇంట్లో మొండెం దుర్గాప్రసాద్ (24)తో పాటు మరో ఇద్దరు ఎలక్ట్రికల్ పనులు చేస్తున్నారు. వీరు పనులు చేసేటప్పుడు విద్యుత్ సరఫరాతోపాటు ఇన్వర్టర్ కూడా ఆపివేశారు. బుధవారం మధ్యాహ్నం వీరు పనులు ముగించుకుని ఇంటికి వచ్చేసి సాయంకాలం తిరిగి అదే ఇంట్లో పనికి వెళ్లారు. అయితే ఇంటి యాజమానికి ఈ విషయం తెలియకపోవడంతో ఇన్వర్టర్‌ను ఆన్ చేసి ఉంచారు. దీంతో పనులు నిర్వర్తిస్తుండగా బుధవారం సాయంత్రం దుర్గాప్రసాద్ విద్యుదాఘాతానికి గురవడంతో మృతి చెందాడు. స్థానిక పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు దుర్గాప్రసాద్‌కు భార్య, కుమారుడు ఉన్నారు.

12 మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19: పూల్‌బాగ్‌కు వెళ్లే జంక్షన్ వద్ద ఓ వ్యక్తి నుంచి 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని బుధవారం రాత్రి కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. పాత జగన్నాథ థియేటర్ ప్రాంతానికి చెందిన వానపల్లి నాగరాజు సంచిలో మద్యం బాటిళ్లు పట్టుకుని వెళుతుండగా పూల్‌బాగ్‌కు వెళ్లే జంక్షన్ వద్ద అనుమానం వచ్చి తనిఖీ చేయగా 12 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయని, వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 19: మండలంలో సంకాడ పంచాయతీ ఉసిరి గూడెంలో పేకాట ఆడుతున్న నలుగురు జూదగాళ్లను అరెస్టు చేసినట్టు ఎస్సై అప్పలసూరి తెలిపారు. నిందితుల నుంచి రూ.6,500 స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

22.69 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 19: మండలంలో ధారకొండ ప్రాంతం నుంచి మైదాన ప్రాంతాలకు ద్విచక్రవాహనంపై గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ అప్పలసూరి తెలిపారు. బుధవారం సాయంత్రం అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారంతో జీకేవీధి పాతవీధి జంక్షన్ వద్ద వాహన తనిఖీలు ప్రారంభించామన్నారు. రెండు ద్విచక్రవాహనాల్లో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను గమనించి వెనక్కి వెళ్లిపోయే ప్రయత్నం చేశారు. దీంతో వెంటనే పోలీసుల అప్రమత్తమై ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇద్దరు వ్యక్తుల నుంచి కాలేజీ బ్యాగుల్లో తరలిస్తున్న 22.69 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరు నిందితులు ధారకొండ ప్రాంతానికి చెందిన వ్యక్తులుగా గుర్తించామని, ఇద్దరిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు. ఈ కేసులో మరో నిందితుడు పరారీలో ఉన్నాడన్నారు.

భార్యాభర్తలపై దాడి చేసిన నిందితుడి ఆత్మహత్య

కశింకోట, సెప్టెంబరు 19: భార్యాభర్తలపై కత్తితో దాడి చేసిన ఓ నిందితుడు నర్సింగబిల్లి - బయ్యవరం మధ్య రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మునగపాక మండలం చూచుకొండ గ్రామంలో అదే గ్రామానికి చెందిన భార్యాభర్తలు కొయిలాడ చంద్రిక, మోహన్‌లపై కత్తితో దాడి చేసిన నిందితుడు కాండ్రేగుల సోంబాబుగా రైల్వే పోలీసులు గుర్తించారు. ఈ మేరకు తుని రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కాగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు సోంబాబు కోసం గాలింపు చేపట్టిన మునగపాక పోలీసులకు రైల్వే పోలీసులు సమాచారం ఇచ్చారు.

ప్రైవేటు బస్సును ఢీకొన్న లారీ : ఐదుగురికి గాయాలు

ఎలమంచిలి, సెప్టెంబరు 19: మండలంలోని రేగుపాలెం జంక్షన్ సమీప జాతీయ రహదారిపై గురువారం రాత్రి ఓ ప్రైవేటు బస్సును లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఓ ఔషధ తయారీ పరిశ్రమలో పని చేస్తున్న ఉద్యోగులను నక్కపల్లి నుంచి ఎలమంచిలి తీసుకువెళుతుండగా రేగుపాలెం జంక్షన్ వద్దకు వచ్చే సరికి అనకాపల్లి నుంచి అడ్డురోడ్డు వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులోని ఉద్యోగులు ఎన్.ప్రవీణ్, ఆర్.ధనుంజయ, రవి, టి.వేణుగోపాల్, మరొకరికి గాయాలయ్యాయి. వీరందరిని విశాఖ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనకాపల్లిలో రెండు అన్న క్యాంటీన్లు ప్రారంభం

- ఎన్టీఆర్ వైద్యాలయం, రైల్వే స్టేషన్‌ల వద్ద అందుబాటులోకి..


రైల్వే స్టేషన్ వద్ద భోజనాలు చేస్తున్న ఎమ్మెల్యే, కూటమి నాయకులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19: పేదల కళ్లల్లో ఆనందం కనిపించింది. గత వైసీపీ పాలనలో మూతపడిన అన్న క్యాంటీన్లు కూటమి ప్రభుత్వ హయాంలో పునఃప్రారంభం కావడంతో సంతోషం వ్యక్తం చేశారు. రూ.5లకే రుచికరమైన భోజనం అందడంతో సంతృప్తిగా భుజించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు.

అనకాపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ వైద్యాలయం, రైల్వేస్టేషన్‌ల వద్ద గురువారం రాత్రి అన్న క్యాంటీన్లను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జనసేన 80వ వార్డు ఇన్‌చార్జి తాడి రామకృష్ణ సతీమణి శాంతి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి కొణతాల రామకృష్ణ, కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు క్యాంటీన్లలో పేదలకు ఎమ్మెల్యే కొణతాలతో పాటు కూటమి నాయకులు భోజనాలు వడ్డించారు. తొలి రోజు స్వీట్, రైస్, ఆనపకాయ, బంగాళదుంప కూర, పెరుగు, పచ్చడి వడ్డించారు. రైల్వేస్టేషన్ వద్ద ఎమ్మెల్యే కొణతాలతోపాటు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తదితరులు భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైన సందర్భంగా శుక్రవారం నుంచి వారోత్సవాలు నిర్వహించి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, ఈఈ చిరంజీవి, కూటమి నాయకులు కోట్ని బాలాజీ, బత్తుల తాతయ్యబాబు, మాదంశెట్టి నీలబాబు, కాయల మురళి, ఉగ్గిన రమణమూర్తి, పొన్నగంటి అప్పారావు, ఆళ్ల రామచంద్రరావు, తాడి రామకృష్ణ, రాము పాల్గొన్నారు.

తేగాడ మోడల్ స్కూల్‌లో డిప్యూటీ డీఈవో విచారణ

కశింకోట, సెప్టెంబరు 19: మండలంలోని తేగాడ మోడల్ స్కూల్‌లో డిప్యూటీ డీఈవో పి.అప్పారావు గురువారం విచారణ చేపట్టారు. ఈ నెల 4న 'ఆంధ్రజ్యోతి'లో 'తేగాడ మోడల్ స్కూల్‌లో వసూళ్ల పర్వం' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో ఆయన స్పందించారు. స్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి వారి నుంచి వివరాలు సేకరించారు. ఈ నివేదికను విద్యాశాఖ ఉన్నతాధికారులకు పంపుతామని ఆయన చెప్పారు. అయన వెంట ఏంఈవో -2 మూర్తి ఉన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

ఆత్మ గౌరవంతో ఆర్థిక స్వావలంబన సాధించండి

- దివ్యాంగులకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పిలుపు
- ఏయూ మెరైన్ గ్రౌండ్‌లో దివ్య కళామేళా ప్రారంభం
- హాజరైన కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్


దివ్యాంగునికి ట్రై సైకిల్ అందజేస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్.

మహారాణిపేట (విశాఖపట్నం), సెప్టెంబరు 19: దివ్యాంగులు ఆత్మ గౌరవంతో ఆర్థిక స్వావలంబన సాధించాలని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆకాంక్షించారు. విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ గ్రౌండ్స్‌లో 11 రోజులపాటు నిర్వహించే 'దివ్య కళా మేళా'ను కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ మంత్రి వీరేంద్రకుమార్‌తో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ విశాఖలో దివ్య కళా మేళాను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో ముందున్నారని, ఎన్‌డీఎఫ్‌డీసీ ద్వారా 1.5 లక్షల మందికి రుణాలు అందించామన్నారు. మేళాలో 20 రాష్ట్రాల దివ్యాంగులు భాగస్వాములవుతున్నారన్నారు. కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ మనసులో దివ్యాంగులకు ఉన్నత స్థానం ఉందని, వారికి ప్రోత్సాహం అందించాలని సూచించారు. పారా ఒలింపిక్స్‌లో మనదేశం 29 పతకాలు సాధించి దివ్యాంగుల శక్తిని నిరూపించిందన్నారు. మేళాలో వివిధ రాష్ట్రాలకు చెందిన 100 మంది కళాకారులు సేంద్రియ ఆహార ఉత్పత్తులు, పరికరాలు, దుస్తులు, ఇతర ఉత్పత్తులను ప్రదర్శించారు. కేంద్ర, రాష్ట్రాల ప్రతినిధులు స్టాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ఉపకరణాలు, రుణ పత్రాలను మంత్రి, గవర్నర్ అంద జేశారు. పలువురికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ ఎం.శ్రీభరత్, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, కలెక్టర్ హరేందిర ప్రసాద్ పాల్గొన్నారు.

పరాయి పంచన గ్రంథాలయం

- ఎనిమిది దశాబ్దాలుగా అద్దె భవనంలో నిర్వహణ
- పట్టణ శివారు కావడంతో పాఠకుల ఇబ్బందులు
- పుస్తకాలు భద్రపరచడానికి వసతి కొరత
- సొంత భవన నిర్మాణానికి అనువైన స్థలం లభించని పరిస్థితి


గ్రంథాలయంలో పుస్తక భాండాగారం

అద్దె భవనంలో నడుస్తున్న శాఖా గ్రంథాలయం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19: ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంతమంది పాలకులు వచ్చినా.. అనకాపల్లిలోని ప్రభుత్వ శాఖా గ్రంథాలయానికి సొంత భవనం ఒనగూరడంలేదు. సుమారు ఎనిమిది దశాబ్దాల నుంచి చాలీచాలని అద్దె భవనాల్లో గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో ఇటు సిబ్బంది, అటు పాఠకులు తీవ్ర అసౌకర్యం చెందుతున్నారు. పుస్తకాలు భద్రపరచడానికి వసతి చాలని పరిస్థితి నెలకొంది.

అనకాపల్లి శాఖా గ్రంథాలయాన్ని 1947లో రైల్వే స్టేషన్‌రోడ్డులోని ఒక అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. అప్పట్లో ఈ ప్రాంతంలో నివాసాలు చాలా తక్కువ వుండేవి. కొంతకాలం తరువాత శాఖ వీధిలోని మరో అద్దె భవనంలోకి మార్చారు. సుమారు మూడు దశాబ్దాల నుంచి గ్రంథాలయం ఇక్కడ కొనసాగుతున్నది. ప్రస్తుతం ఈ గ్రంథాలయంలో ఇతిహాసాలు, పురాణాలు, నవలలు, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, చిన్నపిల్లల పుస్తకాలు సుమారు 30,556 ఉన్నాయి. గ్రేడ్-1లో ఉన్న అనకాపల్లి గ్రంథాలయానికి నిత్యం వంద మందికిపైగా పాఠకులు వస్తుంటారు. ఇదే పట్టణం మధ్యలో ఉంటే వందల మంది ఈ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకునే అవకాశం వుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తోట నగేశ్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా వున్నప్పుడు అనకాపల్లి వచ్చి శాఖ గ్రంథాలయాన్ని పరిశీలించారు. రూ.50 లక్షలతో అధునాతన హంగులతో సొంత భవనం నిర్మిస్తామని చెప్పారు. కానీ పట్టణం మధ్యలో ఎక్కడా సరైన స్థలం లభించకపోవడంతో ఆ ప్రతిపాదన అటకెక్కింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అయినా శాఖ గ్రంథాలయం భవన నిర్మాణానికి స్థలంతోపాటు నిధులు కేటాయించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఐదేళ్లగా ఇన్‌చార్జే దిక్కు..

శాఖా గ్రంథాలయ అధికారి ఐదేళ్ల క్రితం పదవీవిరమణ చేశారు. అప్పటి నుంచి తుమ్మపాల గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఒక పూట తమ్మపాలలో, మరో పూట అనకాపల్లిలో విధులు నిర్వహిస్తున్నారు. అనకాపల్లి గ్రంథాలయంలో సుమారు 20 ఏళ్లగా రికార్డు అసిస్టెంట్, అటెండర్ పోస్టులు ఖాళీగా వున్నాయి.

స్థలం లేకనే భవన నిర్మాణం జరగలేదు



గ్రంథాలయం భవన నిర్మాణానికి నిధులు ఇచ్చేందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ సిద్ధంగా వుంది. కానీ భవనం నిర్మించడానికి అవసరమైన స్థలంలో పట్టణంలో అందుబాటులో లేదు. ప్రస్తుతం గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్న భవనానికి నెలకు రూ.11 వేలు అద్దె చెల్లిస్తున్నాం. సొంత భవనం ఉంటే పాఠకులకు ఎంతో సౌకర్యంగా వుంటుంది.

కె.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి

గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ శాంతి నిరసన


గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19: కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీపై ఎన్డీయే కూటమి నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఎన్టీఆర్ మార్కెట్‌యార్డులోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద గురువారం కాంగ్రెస్ నాయకులు శాంతియుత నిరసన నిర్వహించారు. అనంతరం జిల్లా ఎస్పీ దీపికకు ఎన్డీయే కూటమి నాయకులపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ తమ పార్టీ అధినేత రాహుల్‌గాంధీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక బీజేపీ, శివసేన నాయకులు రాహుల్‌గాంధీపై దారుణమైన వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గూనూరు వెంకటరావు, మలపురెడ్డి కోటేశ్వరరావు, బోయిన భానుమూర్తియాదవ్, కాళ్ల సత్యనారాయణ, కత్తెర శ్రీధర్ పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ ఆందోళన



ధర్నా చేస్తున్న బీజేపీ ఓబీసీ నేతలు

కొత్తూరు, సెప్టెంబరు 19: కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో భారత ప్రభుత్వం, భారతీయులపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేపీ, ఓబీసీ నేతల ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. స్థానిక బీజేపీ కార్యాలయం నుంచి రాహుల్‌గాంధీ డౌన్‌డౌన్ అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ రాహుల్ గాంధీ భారత పౌరసత్వానికి అనర్హుడన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కర్రి రామకృష్ణ మాట్లాడుతూ రాహుల్ గాంధీ కుటుంబమంతా భారత వ్యతిరేకులని ఆరోపించారు. మహిళా పోలీసు స్టేషన్ మీదుగా వేల్పులవీధి, ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజాం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా

- స్థానికేతరుడుని షిఫ్ట్ ఆపరేటర్ నియామకంపై అభ్యంతరం
- బాధితురాలి కుటుంబ సభ్యులను నియమించాలని డిమాండ్


రాజాం సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న ప్రజలు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 19: స్థానికేతరుడుని రాజాం విద్యుత్ సబ్ స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్‌గా నియమించడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం మండల ప్రజలు సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేశారు. గతంలో ఇక్కడ తొమ్మిది సంవత్సరాలుగా షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేసిన ఆర్.భీమవరానికి చెందిన రొంగలి నర్సింగరావు అనారోగ్యంతో మృతి చెందారు. ఖాళీ అయిన పోస్టులో బాధిత కుటుంబాన్ని కాదని, రావికమతం మండలం దొండపూడికి చెందిన వ్యక్తిని ఎంపిక చేయడంపై దివంగత షిఫ్ట్ ఆపరేటర్ నర్సింగరావు భార్య రామలక్ష్మి చే పట్టిన ధర్నాలో పార్టీలకతీతంగా ఆర్.భీమవరం, నీలకంఠాపురం గ్రామాలకు చెందిన పలువురు సంఘీభావం ప్రకటించారు. జీవనాధారం లేని రామలక్ష్మి కుటుంబ సభ్యులను షిఫ్ట్ ఆపరేటర్‌గా ఎంపిక చేయవలసి ఉండగా, స్థానికేతరుడు నియామకంపై రెండు గ్రామాలకు చెందిన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రామలక్ష్మి కుటుంబ సభ్యుల్లో ఒకరిని షిఫ్ట్ ఆపరేటర్‌గా నియమించాలని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజుని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. దీనికి విరుద్ధంగా ఏపీ ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు ఏకపక్షంగా స్థానికేతరుడుని నియమించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికేతరుడి నియామకం రద్దు చేసి, రామలక్ష్మి కుటుంబ సభ్యుల్లో ఒకరిని షిఫ్ట్ ఆపరేటర్‌గా నియమించే వరకు సబ్ స్టేషన్ వద్ద ఆందోళన కొనసాగిస్తామని ప్రజలు హెచ్చరించారు. రామలక్ష్మి ధర్నాకు మద్దతుగా మాజీ సర్పంచులు కోట సత్యనారాయణ, మలిరెడ్డి బాబ్జి, మల్లాం ఎంపీటీసీ సభ్యుడు శ్రీను, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెలంకాయల అప్పలనాయుడు రెండు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఆదివాసీలకు తప్పని డోలి మోతలు

- ఆరు కిలోమీటర్లు రోగిని మోసుకుని డౌనూరు పీహెచ్‌సీకి తరలింపు


జ్వర బాధితుడు లక్ష్మణరావును డోలిపై డౌనూరు ఆస్పత్రికి తరలిస్తున్న తాటిబంద గిరిజనులు


చింతపల్లి, సెప్టెంబరు 19 : గిరిజన ప్రాంతంలో ఆదివాసీలకు డోలి మోతలు తప్పడంలేదు. బుధవారం సాయంత్రం తాటిబంద గ్రామానికి చెందిన జ్వరబాధితుడు సీందరి లక్ష్మణరావుని డోలిపై ఆరు కిలోమీటర్లు మోసుకుని డోలిపై డౌనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మండలంలోని ఎ.శనివారం పంచాయతీ పరిధిలో తాటిబంద గ్రామం ఉన్నది. గ్రామంలో 50 గిరిజన కుటుంబాలు నివాసముంటున్నాయి. గ్రామానికి రహదారి సదుపాయం లేదు. డౌనూరు వెళ్లేందుకు ఒక గెడ్డ, మూడు కాలువాలు దాటుకుని ఆరు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. రోగులు, గర్భిణులను తరచూ ఆస్పత్రికి డోలిపైనే తరలిస్తున్నారు. తీవ్ర జ్వరంతో నడవలేని స్థితిలోనున్న లక్ష్మణరావును స్థానికులు డోలిపై డౌనూరు ఆస్పత్రికి తరలి తరలించారు. ఇప్పటికైన జిల్లా అధికారులు స్పందించి రహదారి సదుపాయం కల్పించాలని ప్రాంతీయులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వరద బాధితులకు స్పీకర్ అయ్యన్న ఒక నెల జీతం విరాళం


సీఎం చంద్రబాబుకు విరాళాన్ని అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, సెప్టెంబరు 19 : విజయవాడ వరద బాధితులు కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి సభాపతి అయ్యన్నపాత్రుడు ఒక నెల జాతం విరాళంగా అందజేశారు. సెప్టెంబరు 4న తన పుట్టిన రోజు సందర్భంగా వరద బాధితులకు ఒక నెల జీతాన్ని విరాళం అందజేస్తానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో గురువారం విజయవాడలో సీఎం చంద్రబాబుని కలిసి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిమితి మేరకు సీఎంఆర్‌ఎఫ్‌కు విరాళం అందజేయాలని కోరారు.

వరద బాధితులకు కెమిక డ్రగ్స్ రూ.10 లక్షల విరాళం


ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు చెక్కు అందజేస్తున్న కెమిక డ్రగ్స్ వైస్ ప్రెసిడెంట్ కలిశెట్టి సాంబశివరావు, తదితరులు

పరవాడ, సెప్టెంబరు 19: వరద బాధితుల సహాయార్థం ఫార్మాసిటీలోని కెమిక డ్రగ్స్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమ రూ.10 లక్షలు సమకూర్చింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కెమిక డ్రగ్స్ వైస్ ప్రెసిడెంట్ కలిశెట్టి సాంబశివరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు ఆకుల దొరబాబు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ


రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

ఎలమంచిలి, సెప్టెంబరు 19: రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ఎలమంచిలి కొక్కిరాపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ ఎం.మాణిక్యం తెలిపారు. విద్యార్థినులు కె.కుమారి, బి.గ్రేష్మ, ఎ.మణి జాతీయ పోటీలకు ఎంపిక కావడంతో వారిని గురువారం పట్టణ ఎస్ఐ సావిత్రి అభినందించారు. అలాగే యోగా కోచ్ మళ్ల రామును కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ రమాదేవి, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో విస్తృత తనిఖీలు


ఎలమంచిలి ఆర్టీసీ బస్టాండ్‌లో జాగిలంతో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ ధనుంజయరావు

ఎలమంచిలి, సెప్టెంబరు 19: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, పార్సిల్ సర్వీసు కేంద్రాల్లో గురువారం సీఐ ధనుంజయరావు, పట్టణ ఎస్ఐ సావిత్రి - పోలీసు జాగిలంతో పాటు పోలీసు సిబ్బందితో విస్తృత తనిఖీలు నిర్వహించారు. మాదకద్రవ్యాల రవాణాను అరికట్టే క్రమంలో భాగంగా ఈ తనిఖీలు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. బస్టాండ్‌లోని ప్రయాణికుల బ్యాగులు, బస్టాండ్ పరిసరాల్లో జాగిలంతో తనిఖీలు చేశారు.

పక్కాగా వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు : జేసీ జాహ్నవి


జాహ్నవి, జేసీ

అనకాపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను పక్కాగా అమలు చేయాలని అధికారులను జేసీ జాహ్నవి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు, శాఖల పనితీరును ఆమె సమీక్ష జరిపారు. ప్రతి 15 రోజులకు ఒకసారి యాక్షన్ ప్లాన్ అమలుపై సమీక్ష జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో సీపీవో రామారావు, హౌసింగ్ పీడీ శ్రీనావాసరావు డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ, వ్యవసాయ, ఉద్యాన, డ్వామా, అటవీ, పంచాయతీరాజ్ ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్స్ కో-ఆర్డినేటర్ కుమార్ సస్పెన్షన్

అనకాపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్స్ పరీక్షా కేంద్రం డిజిటల్ కీ ఇచ్చేందుకు రూ.30 లంచం డిమాండ్ చేసి తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన జిల్లా ఓపెన్ స్కూల్స్ కోఆర్డినేటర్ ఒ.కుమార్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఎంవీ లక్ష్మమ్మ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతి నిరోధక శాఖ అధికారులు కుమార్‌పై కేసు నమోదు చేసిన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసి ప్రభుత్వానికి నివేదిక పంపినట్టు డీఈవో తెలిపారు.

CLASSIFIEDS

EDUCATION

★ **Online Degree,** PG, BBA, MBA, MCA, B.Tech., Diploma, Paramedical, BHM, Ph.D Course Admissions. Low fees and Pass Guarantee Provided. Ph: 7997296796
AJV_204562

CHANGE OF NAME

★ I, **TUNGATURTI NARESH CHAITANYA** (Old Name), S/o. Tungaturthi Janardhanrao, Residing at 11-1/17, Carpenter Colony, Kommadi, Madhurawada, GVMC, VSP. Change my name from **TUNGATURTI NARESH CHAITANYA** (Old Name) to **TUNGATURTHI NARESH CHAITANYA** (New Name) henceforth I am being called as **TUNGATURTHI NARESH CHAITANYA** (New Name), S/o. Tungaturthi Janardhanrao for all purposes.
AJV_204536

CHANGE OF NAME

★ I, **SEYAD OSSALI ANEESH ABUBAKAR** (Old Name), S/o. Seyad Ossali, Residing at 5-1/A, Guthulaputtu, Paderu Mandal, Alluri Seetharamaraju Dist. Change my name from **SEYAD OSSALI ANEESH ABUBAKAR** (Old Name) to **SYED OSSALI ANEESH ABUBACKER** (New Name) henceforth I am being called as **SYED OSSALI ANEESH ABUBACKER** (New Name), S/o. Seyad Ossali for all purposes.
AJV_204537

CHANGE OF NAME

★ I, **BRUNDHA LAVANYA** (Old Name), W/o. Tungaturthi Naresh Chaitanya, Residing at 11-1/17, Carpenter Colony, Kommadi, Madhurawada, GVMC, VSP. Change my name from **BRUNDHA LAVANYA** (Old Name) to **BRUNDA LAVANYA** (New Name), henceforth I am being called as **BRUNDA LAVANYA** (New Name), W/o. Tungaturthi Naresh Chaitanya for all purposes.
AJV_204538

CHANGE OF NAME

★ I, **SARANU RAGHUVENDRA RAO** (Old Name), S/o. Late Saranu Venkateswarlu, Resident of 12-109, Amruthaluru Village, Amruthaluru Mandal, Guntur (Bapatla). Change my name from **SARANU RAGHUVENDRA RAO** (Old Name) to **SARANU RAGHAVENDRA RAO** (New Name) henceforth I am being called as **SARANU RAGHAVENDRA RAO** (New Name), S/o. Late Saranu Venkateswarlu for all purposes.
AJV_192179

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176, 9966165093

'స్వచ్ఛ' సంకల్పానికి శ్రీకారం



ఎలమంచిలి పెంజెరువులో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

ఎలమంచిలి, సెప్టెంబరు 19 : స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మునిసిపాలిటీ ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో సమీపంలోని చెరువుల్లో గురువారం చెత్తాచెదారాన్ని తొలగించారు. అనంతరం బ్లీచింగ్ చల్లారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చెరువులతో పాటు తాగునీటి వనరుల వద్ద కూడా ఈ పనులను చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం : గ్రామాల పరిశుభ్రత అందరి బాధ్యతని మొగలిపురం సర్పంచ్ గండి అరుణ అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామస్థులతో కలిసి పలు వీధుల్లో చెత్తాచెదారాన్ని తొలగించారు. అంతకుముందు ఎంపీటీసీ సభ్యురాలు తరమరాన సన్యాసమ్మ, సచివాలయ సిబ్బంది తదితరులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. వార్డు సభ్యులు అంగటి నానాజీ, తమరాన సత్యనారాయణ, గొటివాడ ఈశ్వరమ్మ, బైలపూడి రాంబాబు, కార్యదర్శి సంతోషి, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్ల : మండల కేంద్రం కోటవురట్లలో స్వచ్ఛత హీసేవా కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు గురువారం సంతబయిలు నుంచి కోటవురట్ల జంక్షన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ భానోజీరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎంపీటీసీ పి.సూర్యారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యేసుదాసు, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



మొగలిపురం ర్యాలీలో సర్పంచ్ అరుణ, ఎంపీటీసీ సన్యాసమ్మ తదితరులు



కోటవురట్ల జంక్షన్‌లో మానవహారం చేస్తున్న విద్యార్థినులు

అనకాపల్లి పరిసర మండలాల్లో భారీ వర్షం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19 : వాతావరణంలో మార్పుల కారణంగా అనకాపల్లి పరిసర మండలాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఆరు గంటల సమయంలో చల్లటి గాలులు వీస్తూ ఒక్కసారిగా వర్షం కురియడంతో రోడ్లపై జనజీవనం స్తంభించింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి, ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నీరు నిలిచిపోయింది. ఈ కారణంగా ప్రయాణికుల రాకపోకలకు కొంత ఇబ్బంది ఏర్పడింది. అయితే పొలాల్లో నీరు చేరడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పేదోడికి పట్టెడన్నం

... 3వ పేజీ తరువాయి

ఇచ్చి, ఆ ప్రకారం తయారు చేయాలని ఆదేశించింది. ఈ ఆహార పదార్థాలు కూడా లెక్క ప్రకారం ఇస్తారు.

టిఫిన్: సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు ఉదయం 7.30 గంటల నుంచి 10 గంటల వరకు టిఫిన్ అందుబాటులో ఉంటుంది. ఇందులో మూడు ఇడ్లీతో చట్నీ లేదా సాంబార్, పొడి ఇస్తారు. మూడు పూరీలను కుర్మాతో ఇస్తారు. ఇడ్లీ రోజూ ఉంటుంది. పూరీ సోమ, గురువారాల్లో చేస్తారు. మంగళవారం, శుక్రవారాల్లో ఉప్మా, బుధవారం, శనివారాల్లో పొంగల్ ఉంటుంది. వీటితో చట్నీ లేదా పొడి/సాంబారు/మిక్చర్ ఇస్తారు. ఉప్మా, పొంగల్ 250 గ్రాములు ఉంటాయి. చట్నీ/పొడి 15 గ్రాములు, సాంబారు 150 గ్రాములు, మిక్చర్ 25 గ్రాములు ఇస్తారు.

లంచ్, డిన్నర్: మధ్యాహ్నం భోజనం 12.30 గంటల నుంచి 3 గంటల వరకు, రాత్రి భోజనం 7.30 గంటల నుంచి 9 గంటల వరకు ఉంటుంది. భోజనంలో అన్నంతో పాటు కూర, పప్పు/సాంబారు, పెరుగు, పచ్చడి ఇస్తారు. అన్నం 400 గ్రాములు, సాంబారు 120 గ్రాములు, కూర 100 గ్రాములు, పచ్చడి 15 గ్రాములు, పెరుగు 75 గ్రాములు ఇస్తారు.

ఇసుక అక్రమాలకు చెక్

... 3వ పేజీ తరువాయి

విక్రయించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోర్టల్ అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు.

అందుబాటులోకి పోర్టల్

జిల్లాలో డిపోల్లో వున్న ఇసుకను ఆఫ్‌లైన్ విధానంలో అమ్మకాలు జరపడంతో పెద్దఎత్తున ఇసుక అక్రమ మార్గంలో తరలిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల నుంచి ఇసుక వ్యాపారుల వరకు ఎవరూ ఇక ముందు డిపోల్లో ఇసుక విక్రయాల విషయంలో అక్రమాలకు పాల్పడే అవకాశం లేకుండా ప్రభుత్వం ఏపీ శాండ్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులతో ఉచిత ఇసుక సరఫరా కోసం కమిటీని ఏర్పాటు చేశారు. పోర్టల్ ద్వారా ఇక ముందు ఉచిత ఇసుక పొందాలనుకొనే వినియోగదారులు గ్రామ, వార్డు సచివాలయాల్లోనే ఆన్‌లైన్ పోర్టల్‌లో ఆధార్ అనుసంధానం ద్వారా బుక్ చేసుకొనే అవకాశం కల్పించారు. అంతే కాకుండా ఉచిత ఇసుక యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని సొంతంగా కూడా బుక్ చేసుకొనే వెసులుబాటు కల్పించారు. రెండు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం జరిగితే సాధారణ బుకింగ్‌కు అవకాశం కల్పించారు. అదే రెండు వేల చదరపు అడుగులకు మించి విస్తీర్ణంలో నిర్మాణ పనులు చేపట్టే వారికి బల్క్ విధానంలో ఇసుక బుక్ చేసుకొనేలా పోర్టల్‌లో వెసులుబాటు కల్పించారు. ఇసుక పోర్టల్ ద్వారా ఉచిత ఇసుక బుక్ చేసుకొనే వినియోగదారులు ఆధార్ కార్డుతో పాటు నిర్మించనున్న భవన నిర్మాణ ప్లాన్ వంటివి కూడా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని జిల్లా గనుల శాఖాధికారి సుబ్బారాయుడు తెలిపారు. నక్కపల్లి ఇసుక డిపోలో నిల్వ ఉన్న ఇసుక ఇక ముందు ఆఫ్‌లైన్‌లో విక్రయాలు జరగవన్నారు. నక్కపల్లిలో ఉన్న ఇసుక గతంలో రూ.1,225 ధర ఉండేదని, ప్రస్తుతం ప్రభుత్వం టన్ను ధరను రూ.1,165కు తగ్గించిందని తెలిపారు. వినియోగదారులు ఆన్‌లైన్ పోర్టల్‌ను వినియోగించుకొని ఉచిత ఇసుకను పొందాలని ఆయన కోరారు.

మైదానాల్లో మెరికలు

- పాఠశాలల్లో మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం
- ఉత్సాహంగా తలపడుతున్న విద్యార్థులు
- తొలుత వక్తల దిశానిర్దేశం



కొత్తపేట స్కూల్‌లో పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోవింద్



అచ్యుతాపురంలో క్రీడలను ప్రారంభిస్తున్న మాజీ జడ్పీటీసీ శ్రీనివాసరావు

పాయకరావుపేట, సెప్టెంబరు 19 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు గురువారం పాయకరావుపేటలో ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీలను తొలుత జడ్పీటీసీ సభ్యులు లంక సూరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో కేవీఎన్ గాంధీ మాట్లాడుతూ మండల స్థాయి ఆటల పోటీల్లో అండర్-14, అండర్-17 బాలురు, బాలికల విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్ చదరంగం, యోగా, అథ్లెటిక్స్ తదితర అంశాల్లో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి త్వరలో జరిగే నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. అనంతరం పలు పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. ఈ కార్యక్రమంలో ఆటల పోటీల కో-ఆర్డినేటర్ పి.రవికుమార్, పీఈటీలు కె.రత్నాలమ్మ, రెహమాన్, సతీష్, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.



పాయకరావుపేట కళాశాల గ్రౌండ్‌లో హోరాహోరీగా కబడ్డీ పోటీ

కశింకోట : మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఇక్కడి బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ప్రారంభమయ్యాయి. బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, యోగా, చదరంగం నిర్వహించారు. సుమారు మూడు వందల మంది ఉత్సాహంగా హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయిరాలు స్వర్ణకుమారి, పీడీ కమల, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఆళ్ల శ్రీనివాసరావు, పెదపాటి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలి : విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. పట్టణంలోని కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడా రంగంలో ఎలమంచిలికి జాతీ స్థాయిలో మంచి గుర్తింపు ఉందన్నారు. విద్యార్థులు క్రీడలపై మరింత మక్కువ పెంచుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో భాగంగా తొలిరోజు వాలీబాల్, చెస్, కబడ్డీ, ఖోఖో, యోగా, షటిల్ తదితర పోటీలు సాగాయి. మునిసిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, కొల్లి త్రినాథ్, కౌన్సిలర్లు, నాయకులు పిట్టా సత్తిబాబు, గొర్లె వెంకట్, సుంకర మానేశ్వరరావు, రాపేటి సంతోష్, మర్రి రాజబాబు, జనసేన నాయకుడు కొఠారు సూర్యప్రకాష్, హెచ్‌ఎం రమణ, పీఈటీలు నాయుడు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని జడ్పీటీసీ మాజీ సభ్యుడు, జనసేన నాయకుడు జనపరెడ్డి శ్రీనివాసరావు అన్నారు. ఇక్కడి ఉన్నతా పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన మండల స్థాయి క్రీడా పోటీలను గురువారం ప్రారంభించి మాట్లాడారు. చదువుతో పాటు క్రీడలపై విద్యార్థులు దృష్టిసారించాలన్నారు. మండల పరిధిలో గల 18 పాఠశాలల నుంచి 350 మంది విద్యార్థులు హాజరయ్యారు. తొలిరోజు పలు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని ఎం.పద్మావతి, నాయకులు బైలపూడి శ్రీరామదాసు, డ్రీమ్స్ నాయుడు, ద్వారపురెడ్డి బాపు, కొరుప్రోలు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అరిపాక పాఠశాలలో..

సబ్బవరం : మండల స్థాయి అండర్-14, 17 బాల, బాలికల క్రీడా పోటీలు ఈనెల 21, 23 తేదీల్లో మండలంలోని అరిపాక జెడ్పీ హైస్కూల్ నిర్వహించనున్నామని మండల క్రీడల కో- ఆర్డినేటర్ అబ్దుల్ రెహ్మాన్ ఒక ప్రకటలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్, బ్యాడ్మింటన్ అంశాల్లో జరగనున్న పోటీల్లో ప్రతిభ చూపిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని వివరించారు. ఔత్సాహికులు ఈ పోటీల్లో పాల్గొనాల్సిందిగా హెచ్‌ఎం మల్లేశ్వరరావుతో పాటు పీఈటీ వి.చందన వర్మ కోరారు.

సింహాద్రి ఎన్టీపీసీలో జిప్సం తయారీ

పరవాడ, సెప్టెంబరు 19 : సల్ఫర్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గించడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించే దిశగా సింహాద్రి ఎన్టీపీసీ నడుం బిగించింది. ప్లాంట్‌లో గల రెండు ఫ్లూ గ్యాస్ డీ సల్ఫరైజేషన్ (ఎఫ్‌జీడీ) యూనిట్ల నుంచి ఉద్గారాలను జిప్సం తయారీకి వినియోగిస్తుంది. ఈ ప్రక్రియ విజయవంతం కావడంతో జిప్సంను విక్రయించేందుకు సన్నద్ధమైంది. గురువారం జిప్సం విక్రయాలను ప్లాంట్ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా జెండా ఊపి ప్రారంభించారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు జిప్సం విక్రయాలు జరుపుతామన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడంలో జిప్సం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన వివిధ విభాగాల జీఎంలు, ఏజీఎంలు, ఉద్యోగులు పాల్గొన్నారు.



జిప్సం విక్రయాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా

కారిడార్ రోడ్డు భూముల పరిహారంపై వినతి

నక్కపల్లి, సెప్టెంబరు 19 : విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులో భాగంగా రహదారి నిర్మాణం కోసం భూములు కోల్పోయే రైతులంతా గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవిని కలిశారు. ఈ మేరకు వారు వినతి పత్రాన్ని అందజేశారు. కాగిత, అమలాపురం సర్పంచ్‌లు పోతంశెట్టి రాజేష్, పెదపూడి శంకరరావు, రైతు సంఘం ప్రతినిధులు సురకాసుల గోవింద్, ఉప సర్పంచ్ గంటా నర్సింగరావు తదితరులు జేసీని కలిసి కారిడార్ రోడ్డు కోసం భూములిచ్చే రైతుల పరిహారం చెల్లించాలని కోరారు.

జెట్టీ నిర్మించాలని వినతి

ఎస్.రాయవరం మండలం బంగారమ్మపాలెంలో ఎన్ఏవోబీ అధికారులు, గ్రామస్థులు చేసుకున్న ఒప్పందాల మేరకు మత్స్యకారులను ఆదుకునేందుకు జెట్టీ నిర్మించాలని ఎంపీటీసీ పేర్ల మాధవ కోరారు. గ్రామస్థులతో కలిసిజనసేన కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ నాయకులు ఆకేటి గోవిందరావు, కురందాసు అప్పలరాజు, పిక్కి స్వామి, పాము గణేశ్, యలమంచిలి చంద్రరావు పాల్గొన్నారు.

ఈపీఎఫ్-95 పెన్షన్ రూ.ఐదు వేలు చేయాలి

- కార్మికులు ధర్నా
- ఆర్డీవో చిన్నికృష్ణకు వినతి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19 : ఇక్కడి ఆర్డీవో కార్యాలయం వద్ద భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈపీఎఫ్-95 పెన్షన్‌దారులకు కనీస పెన్షన్ రూ.ఐదు వేలకు పెంచాలని, ఆ పెన్షన్‌కు డీఏ జోడించాలని, కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా వైద్య సౌకర్యం కల్పించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గోకివాడ శ్రీరాములు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కనీస పింఛన్ పొందుతున్నవారు సుమారు 78 లక్షల మంది ఉన్నారన్నారు. ఈ పెన్షన్ స్కీమ్ 16 నవంబరు 1995లో ప్రారంభించారన్నారు. సుదీర్ఘ పోరాటం తరువాత 2014 సెప్టెంబరు ఒకటిన కనీస పెన్షన్ వెయ్యి రూపాయలకు పెంచారని వివరించారు. నాటి నుంచి నేటి వరకు పెన్షన్ పెంచకపోవడం దారుణమని వాపోయారు. అనంతరం ఆర్డీవో చిన్నికృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కో-కన్వీనర్ అంతర్వేది బాబు, బండారు నరసింహమూర్తి, గంగిరెడ్ల నరేష్, పైలా రమేష్, రెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినికి సత్కారం



విమలాదేవిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 19 : ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన మండలంలోని డీహెచ్.అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని సీహెచ్.విమలాదేవిని గురువారం పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఎలమంచిలి బాలికోన్నత పాఠశాలలో గురువారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఈ మేరకు ఇంగ్లీష్ స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్‌తో పాటు ఉపాధ్యాయులు సత్కరించి అభినందించారు.

కనకదుర్గమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా కిషోర్

కొత్తూరు, సెప్టెంబరు 19 : అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీ పరిధిలో గల కనకదుర్గమ్మ ఆలయంలో జరగనున్న దసరా ఉత్సవాలకు నిర్వహణకు సంబంధించి కమిటీ సభ్యులంతా కలిసి కోటిపల్లి కిషోర్‌ను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అక్టోబర్ మూడవ తేదీ నుంచి ప్రారంభం కానున్న శరన్నవరాత్రి ఉత్సవాలు 12వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమావేశమై చర్చించారు. ఆలయ అధ్యక్షుడు యడ్ల త్రినాథరావు, ధర్మకర్త బోయిన రమణాజీ, అన్నదాన కమిటీ చైర్మన్ దుద్దు శ్రీనివాసరావు, సకురు చంద్రం, ఆలయ అర్చకులు రేజేటి ధర్మాచార్యులు పాల్గొన్నారు.

రాంబిల్లి హైస్కూల్‌కు బీరువా వితరణ



పాఠశాలకు బీరువా అందిస్తున్న నాయకులు

రాం బిల్లి, సెప్టెంబరు 19 : ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎలమంచిలి పట్టణానికి చెందిన బంగారు శెట్టి గురువారం బీరువాను వితరణగా అందజేశారు. ఎంపీపీ శిరీషా శ్రీనుబాబు, పాఠశాల కమిటీ మాజీ చైర్మన్ వర్మ రాజు చేతులమీదుగా దీనిని ఉపాధ్యాయులకు అందించారు. ఎంఈవో ఎం.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.



'భోగాపురం ఎయిర్ పోర్టుకు అల్లూరి పేరు గొప్ప నిర్ణయం'

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19 : విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరును కేబినెట్ సమావేశంలో ప్రకటించడం ఆనందించదగిన విషయమని అనకాపల్లి ప్రాంత రాజపుత్ర సమాజ్ (క్షత్రియ సంక్షేమ సమితి) ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఇక్కడ జరిగిన సమాజ్ సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు డీవీ జగన్నాథరాజు, పెనుమత్స కృష్ణంరాజు, కోశాధికారి పీఎస్ రాజు మాట్లాడారు. ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఈ అంశాన్ని చేర్చడం, అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం ఎయిర్ పోర్టుకు అల్లూరి పేరు పెట్టడం గొప్ప విషయమన్నారు. అలాగే భోగాపురం ఎయిర్‌పోర్టులో ఒక టెర్మినల్‌కు దివంగత పీవీజీ రాజు పేరు పెట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. డీవీవీ గోపాలరాజు, పూసపాటి భరత్‌బాబు, వర్మ, ఉప్పలపాటి మధుబాబు, పాకలపాటి రాజుబాబు, పెనుమత్స సతీష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

'ఎసెన్షియా ఫార్మాలో ప్రమాదంపై విచారణ వివరాలు వెల్లడించాలి'

అచ్యుతాపురం, సెప్టెంబరు 19 : ఇక్కడి ఎస్ఈజెడ్‌లోని ఎసెన్షియా ఫార్మా కార్మాగారంలో ప్రమాదంపై జరిగిన విచారణ నివేదికను బహిర్గతం చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి లోకనాథం డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల భద్రతపై ఆ పార్టీ తలపెట్టిన రక్షణ యాత్రలో భాగంలో గురువారం మండలంలోని పలు గ్రామాల్లో సదరు బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెజ్‌లోని కర్మాగారాలతో పాటు ఫార్మా కర్మాగారాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతూ, పెద్ద సంఖ్యలో కార్మికులు మృతిచెందుతున్నారని వాపోయారు. ఎసెన్షియాలో ఇటీవల జరిగిన ప్రమాదంలో పదిహేడు మంది మృతిచెందడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో రొంగలి రాము, కె.సోమునాయుడు, చేపల తాత తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి చేరిన రక్షణ యాత్ర

అనకాపల్లి టౌన్ : సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఆధ్వర్యంలో ఫార్మా, సెజ్ కార్మికుల భద్రత కోసం చేపట్టిన రక్షణ యాత్ర గురువారం సాయంత్రం అనకాపల్లికి చేరుకుంది. ర్యాలీకి బైపాస్ మురా కార్మిక సంఘం స్వాగతం పలికింది. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ ర్యాలీ శుక్రవారంతో పూర్తవుతుందని, ఇందులో భాగంగా అచ్యుతాపురంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, పెంటకోట శ్రీనివాసరావు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకర్రావు, పార్టీ నాయకులు జి.కోటేశ్వరరావు, ఎ.రాజు, కె.తేలయ్యబాబు, మామిడి రమణ, శివాజీ, డీడీ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

సదరం క్యాంపులో 54 మంది గుర్తింపు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19 : ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం కశింకోట, ఎలమంచిలి మండలాలకు చెందిన దివ్యాంగులకు సదరం క్యాంపు నిర్వహించారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ వెరిఫికేషన్ కార్యక్రమంలో భాగంగా శిబిరానికి 71 మంది హాజరుకాగా 54 మందిని అర్హులుగా గుర్తించినట్టు ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. డాక్టర్లు గంగాధర్, అశోక్‌కుమార్, కనకదుర్గలు దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించారు.

ఉత్తమ కళాశాలగా డీవీఎన్‌కు గుర్తింపు



పురస్కారంతో అధ్యాపకులను అభినందిస్తున్న రత్నాకర్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19 : స్థానిక దాడి వీరునాయుడు కళాశాలకు కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సిస్ (సీఎస్‌సీ) నుంచి అత్యుత్తమ ఉత్తమ గుర్తింపు లభించింది. ఏటా మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఈ పురస్కారం అందిస్తుంటారు. ఈ ఏడాది తమ కళాశాలకు ఈ గౌరవం దక్కినందుకు కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్, వైస్ ప్రిన్సిపాల్ దయామాధురి, అధ్యాపకులు రామ్మోహనరావు, జమీర్ పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

పరవాడ, సెప్టెంబరు 19 : వాడచీపురుపల్లి పంచాయతీ పరిధి పందివానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి మాట్లాడుతూ ఐరన్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పోషకాహార పదార్థాలను తీసుకోవాలన్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలన వివరించారు. వైస్ ఎంపీపీ అప్పలరాజు, సర్పంచ్ శివలంక లక్ష్మి, ఉప సర్పంచ్ కూండ్రపు శ్రీనివాసరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉమా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

లంకెలపాలెం, సెప్టెంబరు 19 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. వార్డు పరిధి లంకెలపాలెం ఏలేరు కాలువ సమీపంలో గల శ్మశానవాటిక వద్ద గురువారం మొక్కలు నాటి మాట్లాడారు. పరవాడ ప్రాంతంలో అధికమవుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు విరివిగా మొక్కలు నాటాలన్నారు.నాయకులు గుర్రం బాబూరావు, గుర్రం రాజు, శివ, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

పూడిమడక మెరైన్ ఎస్ఐగా పైడిరాజు



అచ్యుతాపురం, సెప్టెంబరు 19 : మండలంలోని పూడిమడక మెరైన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా జి.పైడిరాజు నియామకమయ్యారు. ఈ మేరకు గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. భీమిలి ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి విచ్చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం, సెప్టెంబరు 19 : విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల్లో భాగంగా మండంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా మడుతూరు, ఎరికిరెడ్డిపాలెం, తంతడి, అంగవానిపాలెం, దాసరిపాలెం, వాడపాలెం, యాతపాలెం, రాజానపాలెం గ్రామాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

వెదుళ్లనరవ మాజీ సర్పంచ్ పైడిరాజు మృతి



పైడిరాజు (ఫైల్)

సబ్బవరం, సెప్టెంబరు 19 : జీవీఎంసీ 88వ వార్డు వెదుళ్లనరవకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ సారిపల్లి పైడిరాజు (70) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, బండారు అప్పలనాయుడు, జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షులు భర్నికాన బాబూరావు, వార్డు సభ్యులు మొల్లి ముత్యాలనాయుడు తదితరులు ఆయన మృతికి సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. 1995 నుంచి 2006 వరకూ పైడిరాజు వెదుళ్లనరవ సర్పంచ్‌గా పనిచేశారు.

కోలాటం మహిళలకు చీరలు పంపిణీ

సబ్బవరం, సెప్టెంబరు 19 : పెదనాయుడుపాలెం కోదండ సీతారామ కోలాటం బృందం మహిళలకు సబ్బవరం ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు, రెడ్డి దేముడుబాబు, సబ్బవరపు సత్యనారాయణలు గురువారం తమ సొంత నిధులతో చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాల గురువు, సబ్బవరపు నాగేంద్ర, బోకం రామకృష్ణ, కర్రి సత్యనారాయణ, కోటేశ్వరరావు, పైల రాజేశ్, పోతల రమణ, పూర్ణ, కిరణ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమార్కులను వదిలేది లేదు

- తహసీల్దార్ జానకమ్మ



రామచంద్రపురంలో ఇసుక తవ్వకాలు జరుగుతున్న ప్రదేశాల్లో ట్రెంచ్ తవ్విస్తున్న తహసీల్దార్, ఎస్ఐ

కోటవురట్ల, సెప్టెంబరు 19 : మండలంలోని సర్పా, వరహా నదుల పరీవాహక ప్రాంతం నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ప్రాంతాలను అధికారులు గురువారం పరిశీలించారు. 'సర్పా, వరహా నదుల్లో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు' శీర్షికపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి వెంటనే స్పందించారు. ఈ మేరకు తహసీల్దార్ జానకమ్మ, ఎస్ఐ రమేష్ నదుల పరీవాహక ప్రాంతాలను పరిశీలించారు. రాజుపేట పందూరు గొట్టివాడ, రామచంద్రపురం గ్రామాల నదీపరీవాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇసుక అక్రమంగా తవ్వకాలు, రవాణా చేసేవారు ఎంతటి వారైనా సహించేది లేదని స్పష్టం చేశారు.

గోవాడలో కార్మికుల ఆందోళన


ఫ్యాక్టరీలో ఆందోళన చేస్తున్న కార్మికులు

చోడవరం, సెప్టెంబరు 19: వేతన, ఇతర బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గోవాడ షుగర్స్ గుర్తింపు కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు గురువారం సాయంత్రం ఫ్యాక్టరీ ఆవరణలో ఆందోళన నిర్వహించారు. యాజమాన్యం మొండి వైఖరికి నిరసనగా కార్మికులు నినాదాలు చేశారు. ఈ ఆందోళనలో గుర్తింపు కార్మిక సంఘం నాయకులు కేవీవీ ఎస్ భాస్కరరావు, అల్లం రామప్పారావు పాల్గొన్నారు.

నిమజ్జనాలు, అన్న సమారాధనలు


చిలతలదిబ్బకాలనీలో అన్నసంతర్పణ

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 19 : గొలుగొండ మండలం ఏఎల్‌పురం, చోద్యం, లింగంపేట, కొంగసింగి తదితర గ్రామాల్లో గురువారం వినాయక నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. ఏఎల్‌పురం చిడతల దిబ్బ కాలనీ, బీసీ కాలనీ, ఎస్టీకాలనీ, పంచాయతీ కార్యాలయం వద్ద తదితర వీధుల్లో వినాయక విగ్రహాల వద్ద అన్నసమారాధనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, స్థానిక హైస్కూల్ చైర్మన్ లగుడు రాజులునాయుడు, టీడీపీ నాయకులు బొడ్డు జమీలు, చిట్టిబాబు, సిన్నిబాబు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

26వ వార్డులో ప్లాస్టిక్ నిషేధానికి కృషి : కౌన్సిలర్ పద్మావతి


సచివాలయ సిబ్బంది, మునిసిపల్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

నర్సీపట్నం, సెప్టెంబరు 19 : స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా 26వ వార్డులో ప్లాస్టిక్ నిషేధం, మెరుగైన పారిశుధ్య నిర్వహణకు కృషి చేయాలని కౌన్సిలర్ చింతకాయల పద్మావతి పిలుపునిచ్చారు. గురువారం పాత మునిసిపల్ కార్యాలయం వద్ద సచివాలయ ఉద్యోగులు, శానిటేషన్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. వార్డులో ప్లాస్టిక్ నిషేధానికి తన వంతు కృషి చేస్తానని, ప్రజలలో చైతన్యం తీసుకొచ్చేందుకు ర్యాలీ చేస్తామని ఆమె అన్నారు. కార్యక్రమంలో శానటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల్లో తప్పులుంటే టీచర్లను నిలదీస్తారా?

గొలుగొండ, సెప్టెంబరు 19 : విద్యార్థులు నోటు పుస్తకాల్లో తప్పులు రాయగా, దానికి ఉపాధ్యాయులను బాధ్యులుగా చేయడాన్ని నిరసిస్తూ ఇన్‌చార్జ్ ఎంఈవో-1ను ఏపీటీఎఫ్ జిల్లా నేతలు జి.చినబ్బాయి, పడాల అప్పారావు, వేణుతోపాటు పలువురు నాయకులు నిలదీశారు. మండలంలోని ఏటిగైరంపేటలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న ఓ ఉపాధ్యాయుడు తెలుగుమీడియం విద్యార్థులకు బోధించారు. ఈ నెల 1న ఇన్‌చార్జ్ ఎంఈవో ఒ.సత్యనారాయణ ఆ పాఠశాలను సందర్శించారు. సదరు ఉపాధ్యాయుడు చెప్పిన సబ్జెక్టుకు సంబంధించిన కొందరు విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలించారు.


ఇన్‌చార్జి ఎంఈవో-1ను నిలదీస్తున్న ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు

అందులో తప్పులు ఉండడంతో ఆ ఉపాధ్యాయుడిని ఎంఈవో ప్రశ్నించారు. అయితే దీనిపై ఏపీటీఎఫ్ నేతలు భగ్గుమన్నారు. విద్యార్థి నోటు పుస్తకంలో తప్పులు రాసి ఉంటే దానికి టీచర్‌ను నిలదీయడం ఏమిటంటూ ఎంఈవో సత్యనారాయణను నిలదీశారు. ఇది సరైన పద్ధతి కాదని, ఎంఈవో ఏ ఉపాధ్యాయ సంఘానికి కొమ్ముకొస్తూ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

తప్పు ఉంది కాబట్టే..

ఈ విషయమై ఎంఈవో సత్యనారాయణను 'ఆంధ్రజ్యోతి' అడగ్గా ఏటిగైరంపేట పాఠశాలలో నోటు పుస్తకాల్లో చాలా వరకు తప్పులు ఉన్నాయన్నారు. అందుకే సదరు ఉపాధ్యాయుడిని వివరణ కోరినట్టు చెప్పారు.

80 మందికి వైద్య పరీక్షలు

నాతవరం, సెప్టెంబరు 19 : నాతవరం మండలం గొలుగొండపేటలో గురువారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు ఈ వైద్య శిబిరంలో 80 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గొలుగొండపేట, చినగొలుగొండపేట పంచాయతీ కార్యదర్శులు జి.సోమినాయుడు, వి. రాజుబాబు సర్పంచ్ మిరపల వెంకటరమణ వైద్య సిబ్బంది, రామలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు జాబితాలను గుర్తిస్తున్నాం : హౌసింగ్ జేఈ రవిబాబు

మాకవరపాలెం, సెప్టెంబరు 19 : మండలంలో 2014 నుంచి 2019 వరకూఅప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో మంజూరైన ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల జాబితాలను తయారు చేస్తున్నట్టు హౌసింగ్ జేఈ రవిబాబు తెలిపారు. అప్పట్లో 459 ఎన్టీఆర్ గృహాలు మంజూరయ్యాయని చెప్పారు. చాలా వరకూ బిల్లుల చెల్లింపు కూడా జరిగినట్టు వెల్లడించారు. అయితే బిల్లులు పెండింగ్‌లో ఉన్న గృహాలకు సంబంధించి సర్వే చేస్తున్నట్టు చెప్పారు. చాలా చోట్ల తుది దశ నిర్మాణంలో ఉన్న ఇళ్లకు మాత్రమే బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. సర్వే పూర్తయిన తర్వాత జాబితాను ప్రభుత్వానికి పంపిస్తామని జేఈ రవిబాబు తెలిపారు. దీనివల్ల అర్హులైన ప్రతి ఒక్కరికీ బిల్లులు లభించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి పేరు అభినందనీయం

నర్సీపట్నం, సెప్టెంబరు 19 : భోగాపురం అంతర్జాతీయ ఎయిర్ పోరుకు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని క్యాబినేట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం ద్వారా సీఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన మాటని నిలబెట్టుకున్నారని క్షత్రియ పరిషత్ అధ్యక్షులు గణపతిరాజు సూర్య బంగార్రాజు, ట్రెజరర్ బుద్ధరాజు చక్రపాణిరాజు గురువారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. 2023, జూలై 4న విజయవాడలో జరిగిన అల్లూరి జయంతి ముగింపు వేడుకల్లో అప్పుడు ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న చంద్రబాబుని తాము కలిసి భోగాపురం ఎయిర్‌పోర్టుకి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని, రాజధాని అమరావతిలో అల్లూరి స్మృతి వనం ఏర్పాటు చేయాలని, నిరుపేద క్షత్రియులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జంపన నాగేంద్రరాజు పాల్గొన్నారు.

పేదోడికి పట్టెడన్నం

... 3వ పేజీ తరువాయి

ఇచ్చి, ఆ ప్రకారం తయారు చేయాలని ఆదేశించింది. ఈ ఆహార పదార్థాలు కూడా లెక్క ప్రకారం ఇస్తారు.

టిఫిన్ : సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు ఉదయం 7.30 గంటల నుంచి 10 గంటల వరకు టిఫిన్ అందుబాటులో ఉంటుంది. ఇందులో మూడు ఇడ్లీతో చట్నీ లేదా సాంబార్, పొడి ఇస్తారు. మూడు పూరీలను కుర్మాతో ఇస్తారు. ఇడ్లీ రోజూ ఉంటుంది. పూరీ సోమ, గురువారాల్లో చేస్తారు. మంగళవారం, శుక్రవారాల్లో ఉప్మా, బుధవారం, శనివారాల్లో పొంగల్ ఉంటుంది. వీటితో చట్నీ లేదా పొడి/సాంబారు/మిక్చర్ ఇస్తారు. ఉప్మా, పొంగల్ 250 గ్రాములు ఉంటాయి. చట్నీ/పొడి 15 గ్రాములు, సాంబారు 150 గ్రాములు, మిక్చర్ 25 గ్రాములు ఇస్తారు.

లంచ్, డిన్నర్: మధ్యాహ్నం భోజనం 12.30 గంటల నుంచి 3 గంటల వరకు, రాత్రి భోజనం 7.30 గంటల నుంచి 9 గంటల వరకు ఉంటుంది. భోజనంలో అన్నంతో పాటు కూర, పప్పు/సాంబారు, పెరుగు, పచ్చడి ఇస్తారు. అన్నం 400 గ్రాములు, సాంబారు 120 గ్రాములు, కూర 100 గ్రాములు, పచ్చడి 15 గ్రాములు, పెరుగు 75 గ్రాములు ఇస్తారు.

ఇసుక అక్రమాలకు చెక్

... 3వ పేజీ తరువాయి

విక్రయించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోర్టల్ అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు.

అందుబాటులోకి పోర్టల్

జిల్లాలో డిపోల్లో వున్న ఇసుకను ఆఫ్‌లైన్ విధానంలో అమ్మకాలు జరపడంతో పెద్దఎత్తున ఇసుక అక్రమ మార్గంలో తరలిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల నుంచి ఇసుక వ్యాపారుల వరకు ఎవరూ ఇక ముందు డిపోల్లో ఇసుక విక్రయాల విషయంలో అక్రమాలకు పాల్పడే అవకాశం లేకుండా ప్రభుత్వం ఏపీ శాండ్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులతో ఉచిత ఇసుక సరఫరా కోసం కమిటీని ఏర్పాటు చేశారు. పోర్టల్ ద్వారా ఇక ముందు ఉచిత ఇసుక పొందాలనుకొనే వినియోగదారులు గ్రామ, వార్డు సచివాలయాల్లోనే ఆన్‌లైన్ పోర్టల్‌లో ఆధార్ అనుసంధానం ద్వారా బుక్ చేసుకొనే అవకాశం కల్పించారు. అంతే కాకుండా ఉచిత ఇసుక యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని సొంతంగా కూడా బుక్ చేసుకొనే వెసులుబాటు కల్పించారు. రెండు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం జరిగితే సాధారణ బుకింగ్‌కు అవకాశం కల్పించారు. అదే రెండు వేల చదరపు అడుగులకు మించి విస్తీర్ణంలో నిర్మాణ పనులు చేపట్టే వారికి బల్క్ విధానంలో ఇసుక బుక్ చేసుకొనేలా పోర్టల్‌లో వెసులుబాటు కల్పించారు. ఇసుక పోర్టల్ ద్వారా ఉచిత ఇసుక బుక్ చేసుకొనే వినియోగదారులు ఆధార్ కార్డుతో పాటు నిర్మించనున్న భవన నిర్మాణ ప్లాన్ వంటివి కూడా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని జిల్లాగనుల శాఖాధికారి సుబ్బారాయుడు తెలిపారు. నక్కపల్లి ఇసుక డిపోలో నిల్వ ఉన్న ఇసుక ఇక ముందు ఆఫ్‌లైన్‌లో విక్రయాలు జరగవన్నారు. నక్కపల్లిలో ఉన్న ఇసుక గతంలో రూ.1,225 ధర ఉండేదని, ప్రస్తుతం ప్రభుత్వం టన్ను ధరను రూ.1,165కు తగ్గించిందని తెలిపారు. వినియోగదారులు ఆన్‌లైన్ పోర్టల్‌ను వినియోగించుకొని ఉచిత ఇసుకను పొందాలని ఆయన కోరారు.

☛ సంక్షిప్తంగా..

3 నుంచి శ్రీదేవీశరన్నవరాత్రి ఉత్సవాలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పద్మావతి, దివ్యతేజ

నర్సీపట్నం రూరల్, సెప్టెంబరు 19 : శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవీశరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. గురువారం ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను చింతకాయల పద్మావతి, దేవదాయ శాఖ ఈవో దివ్యతేజ ఆవిష్కరించారు. అక్టోబరు 3న కలశ స్థాపనతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టి 13న చండీయాగ సహిత పూర్ణాహుతితో ముగుస్తాయని తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారులకు పద్మావతి సూచించారు.

ఎస్‌ఐలు బాధ్యతల స్వీకారం


రమేశ్


రాజారావు

నర్సీపట్నం రూరల్, సెప్టెంబరు 19 : పట్టణ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా రమేశ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కోటపాడు మండలం ఎ.కోడూరులో ఎస్సైగా పని చేస్తూ బదిలీ మీద నర్సీపట్నం వచ్చారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన సుధాకరావు అచ్చుతాపురం బదిలీ అయ్యారు.

రూరల్ ఎస్సైగా రాజారావు

నర్సీపట్నం రూరల్ ఎస్సైగా పి. రాజారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏఎస్ఆర్ జిల్లా పంప పోలీస్ స్టేషన్‌లో పని చేస్తూ బదిలీ మీద ఇక్కడ రూరల్ స్టేషన్‌కి వచ్చారు. ఇంతకు ముందు ఇక్కడ ఎస్సైగా పని చేసిన భీమరాజు నాతవరం బదిలీ అయ్యారు

మెయిన్ రోడ్డులో ఆక్రమణలు తొలగింపు

నర్సీపట్నం రూరల్, సెప్టెంబరు 19 : మెయిన్ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతంరాయంగా ఉన్న ఆక్రమణలను పోలీసులు తొలగించారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయం గోడను ఆనుకొని పార్కింగ్ చేసి ఉంచిన చిన్న కార్లు తీసేయాలని సూచించారు. శ్రీకన్య కూడలి నుంచి అబీద్ సెంటర్, ఐదు రోడ్ల కూడలి, కృష్ణాబజార్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న తోపుడు బండ్లు, బడ్డీలు తొలగించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా వ్యాపారం చేసుకోవాలని సూచించారు. రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్సై సుధాకరరావు, పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం


మాడుగులలో వర్షం కురుస్తున్న దృశ్యం

మాడుగుల/మాడుగుల రూరల్, సెప్టెంబరు 19 : మండలంలో గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం పొడిగానే ఉంది. రోజూ మాదిరిగానే ఎండ తీవ్రత కొనసాగింది. కాగా, సాయంత్రం నాలుగు గంటలకు వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చింది. ఆకాశం మేఘావృతమై తేలికపాటి జల్లులతో ఆరంభమై మోస్తరు వర్షం పడింది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. పంట పొలాల్లో నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బుచ్చెయ్యపేట : గత వారం రోజులుగా ఎండలు వేసవిని తలపిస్తుండడంతో ఇబ్బంది పడుతున్న ప్రజానీకం గురువారం పలు మండలాల్లో కురిసిన వర్షానికి వాతావరణం చల్లపడడంతో ఉపసమనం పొందారు. బుచ్చెయ్యపేట మండలంలో మధ్యాహ్నం వరకు ఎండ మండిపోయింది. సాయంత్ర ఐదు నుంచి నుంచి ఆరు గంటల వరకు గంట పాటు వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడడంతో పిల్లలు, వృద్ధులు ఉపశమనం పొందారు. ఎండిపోతున్న పంటలకు వర్షం ఊపిరి పోసిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు వ్యవసాయ విద్యుత్‌కు అంతరాయం

చోడవరం, సెప్టెంబరు 19 : మండలంలోని చాకిపల్లి ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతులకు వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ ఏఈ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. రైతులంతా ఇందుకు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

మాడుగుల ఆస్పత్రిలో సమస్యపై ప్రత్యేక దృష్టి

▸▸ రూ.40 లక్షల నిధుల మంజూరుకు ఎమ్మెల్యే 'బండారు' హామీ

మాడుగుల, సెప్టెంబరు 19 : ఇక్కడి వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వెనుక భాగంలో నిర్మాణ దశలో ఉన్న అదనపు భవనం పనులను పరిశీలించారు. సదరు పనులు అర్థాంతరంగా నిలిపివేసిన కాంట్రాక్టర్ తీరుపై మండిపడ్డారు. అనంతరం వైద్యులతో మాట్లాడి రోగులకు అందుతున్న వైద్యం, సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. సిబ్బంది కొరత కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అంబులెన్స్ లేక అత్యవసర సమయాల్లో రోగులు అవస్థలు పడుతున్నారని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే, ఆస్పత్రి భవనం మరమ్మతులకు గురైందని, కొన్ని సామగ్రి కూడా లేకపోవడంతో వైద్య సేవలకు ఇబ్బందులు ఎదురవుతున్నట్టు వివరించారు. దీంతో ఆయన రూ.40 లక్షలు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ సహాయంతో ఆస్పత్రికి అంబులెన్స్ ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆస్పత్రి అభివృద్ధిపై


ఆస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అంతకు ముందు ఆస్పత్రిలో చేరిన రోగులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాడుగుల నియోజకవర్గంలో రెండు అదనపు భవనాలు మంజూరు కాగా, కె.కోట పాడులో పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగినప్పటికీ ఇక్కడ జరగలేదన్నారు. దీంతో సదరు కాంట్రాక్టర్‌కు ఇప్పటికే మూడు నోటీసులు పంపడం జరిగిందన్నారు. మరో దఫా నోటీసు పంపించినా స్పందించకపోతే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఇప్పటివరకూ జరిగిన పనులకు సంబంధించిన బిల్లులు కూడా మంజూరు చేయడం జరగదని పేర్కొన్నారు. అనంతరం స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో నియోజకవర్గంలోని మండలాలకు చెందిన పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు అద్దెపల్లి జగ్గారావు, ఉండూరి దేముడు, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, లెక్కల కాశీబాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంజిత్‌వర్మ, సూర్యనారాయణరాజు, డిల్లీ నానాజీ, రొబ్బ మహేష్, నందారపు సన్యాసిరావు, వడ్డే రాజ్ కుమార్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

దేవరాపల్లి, సెప్టెంబరు 19 : ములకలాపల్లిలో ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన వడగంట్ల యశ్వంత్ (12) కుటుంబాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి గురువారం పరామర్శించారు. ప్రభుత్వం నుంచి రావలసిన సహాయం అందే విధంగా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, పోతల ప్రాతునాయుడు, సోమిరెడ్డి గోవింద, బాబూరావు, తమదాన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హి సేవాపై అవగాహన ర్యాలీ


రోలుగుంటలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

రోలుగుంట, సెప్టెంబరు 19 : స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం రోలుగుంటలో గ్రామ కార్యదర్శి కిరణ్, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో జడ్పీ పాఠశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరు చేసి క్లాప్‌మిత్రలకు అందజేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, ఎంపీటీసీ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చీడికాడలో మొక్కలు నాటిన ఎంపీటీసీ

చీడికాడ : పాఠశాల ఆవరణలో నాటిన మొక్కల సంరక్షణకు ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు కూడా బాధ్యత తీసుకోవాలని దిబ్బపాలెం ఎంపీటీసీ సభ్యుడు దారపు పెద్దినాయుడు కోరారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో గురువారం మొక్కలు నాటి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకుడు గౌరీపట్టపు నానాజీ, గ్రామ యువకులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణపై రైతులకు అవగాహన

రోలుగుంట, సెప్టెంబరు 19 : విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఏఈ పద్మనాభం పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎంకేపట్నం, పెదపేట, ఎంకేపట్నం, ఛటర్జీపురంలలో విద్యుత్ ప్రమాదాల నివారణపై కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలి వానల కారణంగా లైన్లు తెగినా, పోల్స్ వంగినా విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు పశువులు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పొలాల్లో కరెంటు స్టార్టర్‌కు ఇనుప డబ్బాలు కాకుండా ఫైబర్ డబ్బాలు మార్చుకోవాలని


పెదపేటలో కరపత్రాలతో అవగాహన కల్పిస్తున్న ఏఈ

సూచించారు. పొడవైన ఇనుప పైపులు, చువ్వలు వైర్లకు దగ్గరగా తీసుకువెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు.


'బాల్య వివాహాలు చేయడం నేరం'

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 19 : బాల్య వివాహాలు నేరమని సీఎస్‌డబ్ల్యూ కనకమహాలక్ష్మి అన్నారు. కోమళ్లపూడి, గంటి కొర్లాంలలో ప్రచార రథం ద్వారా గురువారం ఆమె బాల్య వివాహాల వల్ల అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీడీఏసీ సిబ్బంది అర్జునమ్మ, ప్రసాద్, గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

రావికమతం : బాల్య వివాహాలపై సమాచారం ఇవ్వాలని అనకాపల్లికి చెందిన సీడ్ స్వచ్ఛంద సేవా సంస ప్రతినిధి కె.కనకమహాలక్ష్మి కోరారు. మండలంలోని మేడివాడ, గుమ్మాళ్లపాడు గ్రామాలతో పాటు రావికమతం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినీ విద్యార్థులకు గురువా రం బాల్య వివాహాల వల్ల


కోమళ్లపూడిలో బాల్య వివాహాలను అరికడతామని ప్రతిజ్ఞ

ఎదురయ్యే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బ్రహ్మాజీ, హెచ్‌ఎం మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చెరకు మద్దతు ధర టన్నుకు రూ.3500 ఇవ్వాలి

▸▸ 'గోవాడ' ఎండీకి జనసేన నేత రాజు వినతి

చోడవరం, సెప్టెంబరు 19 : గోవాడ షుగర్ ఫ్యాక్టరీ సమస్యలతో పాటు, సంస్థను కాపాడేందుకు అవసరమైన సహకారం అందించేలా కోరేందుకు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లను కలవనున్నట్టు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు తెలిపారు. గోవాడ చెరకు రైతులకు గిట్టుబాటు ధర రూ.3500 ఇవ్వాలని కోరుతూ గురువారం ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడును కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరకు రైతులకు దవ్వ ఉచితంగా


ఎండీకి వినతి పత్రం అందిస్తున్న జనసేన నాయకుడు పీవీఎస్ఎన్ రాజు

ఇవ్వడంతో పాటు రైతులు, కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే, గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో కార్మికులతో రాజు మాట్లాడారు. షుగర్ ఫ్యాక్టరీ నిర్వహణ, రైతులు కార్మికుల బకాయిలపై ఫ్యాక్టరీ చైర్మన్, ఎండీలు మహాజన సభలో స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ ఫ్యాక్టరీ నిర్వహణలో ఎండీ సమర్థంగా వ్యవహరించడం లేదని, ఫ్యాక్టరీ దుస్థితికి కార్మికులదే తప్పన్నట్టుగా వారిపై పూర్తిగా నెపాన్ని నెట్టివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్మికుల వేతన బకాయిలు నెలల తరబడి పెండింగ్‌లో ఉంచారని, పీఎఫ్ కూడా కట్టకపోవడం వల్ల కార్మికుల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వాపోయారు. ఫ్యాక్టరీ నడపడం చేతకాకపోతే కార్మికులకు, తమకు ఏడాది పాటు అప్పగించాలని, ఫ్యాక్టరీని ఎలా నడిపించాలో చేసి చూపిస్తామని ఆయన సవాల్ విసిరారు. మహాజన సభలో కలెక్టర్ కేవలం మద్దతు ధరపై తూ.తూ. మంత్రంగా ప్రకటించి సభను ముగించాలని చూస్తే సరిపోదని, రైతులు కార్మికుల పక్షాన తాము ముందుండి పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు అల్లం రామప్పారావు, గూనూరు మూలినాయుడు, డీఎస్ నాయుడు, మైచర్ల నాయుడు, కర్రి రమేష్, దాడి వెంకట అప్పారావు, ఆడారి రమణనాయుడు, పీలా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ ప్రారంభం

రావికమతం, సెప్టెంబరు 19 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇక్కడి జడ్పీ హైస్కూల్‌లో గురువారం మండలస్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ పైల లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలను తొలుత ఎంపీడీవో వెంకన్నబాబు, ఎంఈవో బ్రహ్మాజీ ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలకు తొలిరోజు మండలంలోని అన్ని పాఠశాలల నుంచి 120 మంది విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, ఎంపీటీసీ వి.లక్ష్మి నాగేశ్వరావు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ అప్పారావు, హెచ్‌ఎం మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీవో వెంకన్నబాబు

నేటి కె.కోటపాడు పాఠశాలలో పోటీలు

కె.కోటపాడు : మండల స్థాయి బాల బాలికల అండర్-14, 17 ఆటల పోటీలు శుక్రవారం ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభం కానున్నాయని ప్రధానోపాధ్యాయిని పద్మావతి తెలిపారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా అథ్లెటిక్స్ అంశాల్లో నిర్వహిస్తారన్నారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని వివరించారు. పోటీల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేసినట్టు చెప్పారు.

వడ్డాది హైస్కూల్‌లో 23 నుంచి ...

బుచ్చెయ్యపేట : వడ్డాది కేపీడీ జడ్పీ హైస్కూల్‌లో ఈనెల 23, 24 తేదీల్లో మండల స్థాయి బాల, బాలికల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు హెచ్‌ఎం శేషుబాబు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయన్నారు. ఈ పోటీల్లో ఎనిమిది జడ్పీ హైస్కూళ్లకు చెందిన విద్యార్థులతో పాటు ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులు పాల్గొంటారన్నారు.